క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మండల కేంద్రం పాన్‌గల్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు ఆది చంద్రయ్య తండ్రి బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం నిర్వహించిన దశదిన కర్మకు ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, సురేష్‌రావు, నవీన్ రెడ్డి, యాదగిరి, ఆదిహన్మంతు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల పంపిణీ



పెబ్బేరు రూరల్: మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణులకు, ఆరేళ్ల లోపు పిల్లలకు బీసీజీ, రోటావైరెస్, మీజిల్స్, పెంటావాలెంట్, డీటీ, జేఈ, డీపీటీ, విటమిన్-ఏ ఇంకా పలు రకాల టీకాలను బుధవారం ఏఎన్‌ఎంలు వేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్‌ఎం వెంకటమ్మ, శారద, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్‌లో పోలీసుల తనిఖీలు

అమరచింత: మండలంలోని కిష్టంపల్లి గ్రామంలో కొనసాగుతున్న బెల్ట్ షాప్‌పై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించి ఏడున్నర లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన రాజు తన షాపులో మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి, మద్యం సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేశామన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం గ్రామంలో అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయాలు జరపరాదని హెచ్చరించారు. అక్రమంగా బెల్ట్ షాపులను నిర్వహిస్తే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురంలో బుధవారం సాయంత్రం కుమ్మరి రాఘవేందర్ ఇంట్లో మద్యం అమ్ముతున్నాడని సమాచారం మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాడులు చేశారు. 8 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా.. వాటి విలువ రూ.8,280 ఉంటుందన్నారు. కుమ్మరి రాఘవేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరస్పర దాడులు: కేసులు నమోదు



కొత్తకోట (ఆత్మకూర్): మున్సిపాలిటీ కేంద్రంలోని బీసీకాలనీలో పరస్పర దాడులకు పాల్పడిన యువకులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఈమేరకు బుధవారం బీసీ కాలనీలో సీఐ, ఎస్‌ఐ బృందం విచారణ చేపట్టారు. మూడు రోజుల క్రితం రేవల్లి శ్రీను, అదే కాలనీకి చెందిన గడ్డమీది శ్రీనివాసులు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనలో గడ్డమీది శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. తనను కులంపేరుతో దూషించాడని రేవల్లి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు, దాడి ఘటనలో గడ్డమీది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదులపై కాలనీలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. డీఎస్పీ విచారణ అనంతరం పూర్తి వివరాలను తెలుపుతామని సీఐ తెలిపారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం జిల్లా వైద్య అధికారి డా.జయచంద్రమోహన్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చిన ప్రతి రోగికి గౌరవం ఇవ్వాలని, రోగుల ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. పీహెచ్‌సీల్లో అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు, సేవలు గురించి తెలుసుకున్నారు. వేసవిలో వడదెబ్బను నివారించడానికి పీహెచ్‌సీ, సబ్ సెంటర్ల స్థాయిలో తగిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచాలని, ఓపీడీ, ఐపీడీ సేవలకు, హిమోగ్లోబిన్ పెంచడానికి ఏఎన్‌సీలకు సేంద్రియ పద్ధతిలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

వికసించిన పల్లె కుసుమాలు

పాన్‌గల్: ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం ప్రకటించిన ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రైవేట్‌కు ధీటుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశం శెట్టి పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 109 మంది పరీక్షలకు హాజరు కాగా 89 మంది, ద్వితీయ సంవత్సరంలో 78 మందికి 76 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో రాచూరి నరేష్ 930 (ఎంపీసీ), తేజ 929 (సీఈసీ)మూడవత్ అంజలి 900 (బైపీసీ), కల్పన 836 (హెచ్‌ఈసీ)

ప్రథమ సంవత్సరంలో సంజన 389 (బైపీసీ) తె/మీ, మహేశ్వరి 374 (బైపీసీ) ఇ/మీ మార్కులు సాధించారని తెలిపారు.

గొర్రెల కాపరి కుమారుడు..

మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన సువర్ణ, పరమేష్ దంపతుల కుమారుడు నరేష్ 930 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. తండ్రి గొర్రెల కాపారిగా జీతం ఉంటూ కుమారుడి చదివించాడు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 48 మంది పరీక్షలు రాయగా ఆరుగురు, ద్వీతీయ సంవత్సరంలో 44 మందికి 17 ఉతీర్ణత సాధించారు. పెబ్బేరు మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో ప్రథమ సవంత్సరంలో 110 మంది విద్యార్థులకు గాను 67 మంది, ద్వితీయ సంవత్సరంలో 116 మంది పరీక్ష రాయగా 101 ఉత్తీర్ణత సాధించారు.

కొత్తకోట (కొత్తకోట రూరల్): అమడబాకుల మోడల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీలో మీనాక్షి441, పి.అమూల్య 433, కె.స్పందన 426, మేఘన 418, బైపీసీలో కె.జోష్న 409, త్రిష 409, సీఈసీలో కళ్యాణి 447, రాహుల్‌నాయక్ 436, ఆర్.సింహాద్రి 409 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి.దివ్యశ్రీ 972, ఎస్.రజిత 926, బి.భార్గవి 914, పి.విద్యశ్రీ 904 బైపీసీలో శశికళ 955, అనుశ్రీ 952, సింధు 935, కృష్ణవేణి 929, సీఈసీలో పి.భార్గవి 926, పి.నిఖిత 914 మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో 70శాతం, సెకండియర్‌లో 75శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి తెలిపారు.

వనపర్తి (ఖిల్లాఘనపురం): తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవి బైపీసీలో 953 మార్కులతో, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో మానిక 463 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. అనూష 457, శ్రీకావ్య 450 మార్కులు సాధించి మండల ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. మోడల్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 109 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 48 మంది, ద్వితీయ సంవత్సరంలో 77 మంది పరీక్ష రాయగా 46 మంది ఉత్తీర్ణులయ్యారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాఘవేందర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో బైపీసీకి చెందిన వైష్ణవి 953 మార్కులతో ప్రథమ స్థానం, ఎంపీసీకి చెందిన విజయ్‌కుమార్ 910 మార్కులతో ద్వితీయ స్థానం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ చదువుతున్న రామేశ్వరి 868 మార్కులతో తృతీయ స్థానంలో నిలించింది. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 50 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 23 మంది, ద్వితీయ సంవత్సరంలో 55 మంది పరీక్ష రాయగా 25 మంది ఉత్తీర్ణులయ్యారు.


హేమలత (975)


కార్తీక్ సాగర్ (978)


అభిలాష్ (459)


నరేందర్ (455)


వైష్ణవి (953)


మానిక(463)


అనుశ్రీ (952)


అనుశ్రీ (926)


శిల్పమాధురి


స్నేహ


సుగుణ

వనపర్తి (గోపాల్‌పేట): బుద్దారం గురుకుల పాఠశాలకు చెందిన శిల్పమాధురి ఎంపీసీ మొదటి సంవత్సరంలో 466, సుగుణ, స్నేహ 465, అంకిత 464, అనూష 461 మార్కులు సాధించారు. రెండో సంవత్సరంలో ఎంపీసీలో బిందు 955 మార్కులు, బైపీసీలో సుజాత 974 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరంలో 80శాతం, రెండో సంవత్సరంలో 94 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆరోగ్యం తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా కళాశాలలో రెండో సంవత్సరం సీఈసీ 84శాతం, ఎంపీహెచ్‌డబ్ల్యూ 96.55 శాతం, జూనియర్ కాలేజీలో రెండో సంవత్సరంలో 66.58 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన హేమలత వనపర్తి స్కాలర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 975 మార్కులు సాధించింది. మదనాపురం సాంఘిక సంక్షేమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కార్తీక్ సాగర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం 978 మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరంలో అభిలాష్ ఎంపీసీ 459 మార్కులు, నరేందర్ 455 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు.


తల్లితో నరేష్ (930)

రోజువారి కూలీ కుమార్తె..


తల్లిదండ్రులతో మూడవత్ అంజలి(900)

గోప్లాపూర్ తండాకు చెందిన రోజువారి కూలీ దేవమ్మ, రాయుడు కుమార్తె అంజలి ఇంటర్ బైపీసీలో 900 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో రోజువారి కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. తండాలో అవ్వ, తాతల వద్ద ఉంటూ ప్రతి రోజు నాల్గు, ఐదు కిలోమీటర్లు కాలినడకన కాలేజీకి వెళ్లి చదువుకున్న అంజలి ఇంటర్‌లో మంచి మార్కులు సాధించింది. భవిష్యత్తులో డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని తెలిపింది.

కొత్తకోట (ఆత్మకూర్): కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 77.41 శాతం, ద్వితీయ సంవత్సరంలో 67 శాతం, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ శివలీల తెలిపారు. సీఈసీ విభాగంలో రాణి 927 మార్కులు, పూజిత 464, శ్రీపల్లవి 906, కీర్తన 440 మార్కులు సాధించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు తెలిపారు.


రాణి (927)


పూజిత (464)


పల్లవి (906)



కీర్తన (440)

బ్యాంకు మేనేజర్ అవుతా


తల్లిదండ్రులతో కాశీపేట తేజ (929)

పాన్‌గల్: ఇంటర్ ఫలితాలల్లో సీఈసీ విభాగంలో 929 మార్కులు సాధించిన కాశీపేట తేజ భవిష్యత్‌లో మంచిగా చదివి బ్యాంకు మేనేజర్ అవుతానని తెలిపారు. మండలంలోని కదిరెపాడుకు చెందిన నాగేశ్వరి, విష్ణు దంపతులు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడి తల్లిదండ్రులను మంచిగా చూసుకుంటానని తెలిపారు.

డాక్టర్‌గా సేవలందిస్తా..


తాటికొండ రేణుక

పెబ్బేరు రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీలోని చెలిమిల్లకు చెందిన తాటికొండ వెంకటయ్య, లలితమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. వెంకటయ్య మేస్త్రీగా పని చేసి కుటుంబాన్ని పోషిస్తూ.. కుమార్తెలను చదివిస్తున్నాడు. పెద్ద కూతురు తాటికొండ రేణుక 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పెబ్బేరు మోడల్ పాఠశాల, అక్కడే ఇంటర్ బైపీసీ పూర్తి చేసింది. బుధవారం వెలుబడిన ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బైపీసీలో 981 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో ఎంసెట్‌కు సన్నద్ధం అవుతున్నానని, డాక్టర్‌గా పేదలకు సేవలు అందించడమే తన లక్ష్యమని తెలిపింది.

ఇంజినీర్‌ను కావాలనుంది


తల్లితండ్రులతో హిమజ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన అవుకు సురేంద్రబాబు, రేవతి దంపతుల కుమార్తె హిమజ బుధవారం వెలువడిన ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో 1000 మార్కులకు గాను 980 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటుంది. ఈ సందర్భంగా హిమజ మాట్లాడుతూ ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించి మంచి కాలేజీలో సీటు తెచ్చుకొని ఇంజినీర్‌గా సేవలు అందిస్తానని తెలిపింది. పెబ్బేరు ప్రభుత్వ మోడల్ పాఠశాలలో 6 నుంచి 10వతరగతి, మోడల్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న జాగృతి కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్య కమిటీ సభ్యులు

వనపర్తి: ఇంటర్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలల విద్యార్థులు రాష్ట్రంలోనే ఉత్తమ మార్కులు సాధించుకుని ప్రభంజనం సృష్టించారు. జిల్లా కేంద్రంలోని జాగృతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్టంలోనే ఉత్తమ మార్కులు సాధించి జిల్లా ఖ్యాతిని నిలబెట్టారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో నిఖిత 991 మార్కులు, ఎంపీసీ విభాగంలో అంజలి 988 మార్కులు సాధించుకున్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో మేఘన, భవ్య, చరిత అనే ముగ్గురు విద్యార్థినులు 467 మార్కులు సాధించి టాపర్లు నిలిచారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, యాజమాన్య కమిటీ సభ్యులు భాస్కర్, శ్యామ్, సత్యనారాయణ పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు

రావూస్ విజయకేతనం

జిల్లా కేంద్రంలోని రావూస్ జూనియర్ కళాశాల విద్యార్థి కార్తీక్‌యాదవ్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 989 మార్కులు సాధించుకుని వనపర్తికే వన్నె తీసుకొచ్చారు.

రాష్ట్రస్థాయిలో స్కాలర్స్ విద్యార్థులు

స్థానిక స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించుకున్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ప్రశాంతి 988, అనుశ్రీ 983, బైపీసీ విభాగంలో ఎండీ కౌసర్ 984, సుమయనూర్ 982 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో అభినయకృష్ణ 465 మార్కులు, రాజు 465 సాధించగా.. బైపీసీలో యశశ్రీ 438 మార్కులు, స్రవంతి 437 మార్కులతో సత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్య కమిటీ సభ్యులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వరప్రసాద్‌తో పాటు ప్రిన్సిపాల్ శ్రీధర్ అభినందించారు.


యశశ్రీని అభినందిస్తున్న స్కాలర్స్ కళాశాల యాజమాన్యం

సమయపాలన పాటించని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

వనపర్తి (గోపాల్‌పేట): మండల కేంద్రంలో పని చేసే ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం పదిన్నర గంటల వరకు అధికారులు, సిబ్బంది కార్యాలయానికి హాజరు కావడం లేదని స్థానికులు 'సాక్షి'కి తెలియజేశారు. దీంతో బుధవారం సాక్షి ప్రతినిధి మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి చూడగా పదిన్నర గంటల వరకు ఎంపీడీఓ శేఖర్, కార్యాలయ సిబ్బంది ఎవరూ హాజరు కాలేదు. ఎంపీడీఓను వివరణ కోరగా మీటింగ్‌లో ఉన్నందున రాలేదని తెలిపారు. కార్యాలయ సిబ్బంది హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటానని సమాధానమిచ్చారు.

షాపు యజమానులకు జరిమానా

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలో తూనికల కొలతల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి పలు వైన్ షాపులకు అనుబంధంగా అమ్ముతున్న వాటర్ బాటిళ్ల షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం షాపుల్లో వాటర్ బాటిళ్లను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా అమ్ముతుండడంతో తనిఖీలు నిర్వహించి మూడు షాపులకు రూ.5వేల చొప్పున జరిమానా విధించామని తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

వనపర్తి (ఖిల్లాఘనపురం): కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద 138వ మే డే ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ తదితర అన్ని విభాగాల్లో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే వేతనాలను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా ప్రతి నెల అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రంగన్న, భీమయ్య, నాగన్న, మునీంద్ర, సాయి కృష్ణ, భాస్కర్, సంగీత, పద్మ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.


మే డే వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరులో బధవారం రెండు ఆలయాల నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యుడు పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ సంస్థానధీశులు రెడ్డిరాజుల పాలనలో సూగూరు సంస్థానంలో నిర్మించిన వీరభద్రస్వామి, జనార్దనస్వామి ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నందున గ్రామ పెద్దల నిర్ణయం మేరకు దాతల సహకారంతో నూతన ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, సితార వెంకటేశ్వర్లు, మాధవుడు, జయన్నశెట్టి, వెంకటయ్యయాదవ్, నారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.


సూగూరులో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామ పెద్దలు

ఐపీఎల్ టికెట్ల కుంభకోణంపై విచారణ

అమరచింత: ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో జరుగుతున్న కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేసి దోషులను శిక్షించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. ఐపీఎల్‌లో జరుగుతున్న అక్రమాల గురించి ఉన్నత స్థాయి విచారణ జరిపించాలన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బోర్డు ఆధ్వర్యంలో ఉప్పల్ స్టేడియంలో గతంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్లు అమ్మకంలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయన్నారు. ఏప్రిల్ 25న ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరగగా.. హెచ్‌సీఏ బోర్డు మ్యాచ్ కోసం 36 వేల టికెట్లను అమ్మకానికి పెట్టిందన్నారు. అమ్మకానికి పెట్టిన నిమిషాల్లోనే ఎలా అమ్ముడుపోతాయని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలపై విచారణ జరిపి క్రికెట్ అభిమానులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అనురాగ్, చేతన్, రోహిత్, మార్టిన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుతుబ్

ముగిసిన శివరామాంజనేయ ఉత్సవాలు

పాన్‌గల్: మండలంలోని అన్నారంలో నూతనంగా నిర్మించిన శివరామాంజనేయ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు గురువారంతో ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు శ్రీరామచంద్రుడి, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ, గరుడ స్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ, హోమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


వేడుకల్లో పాల్గొన్న నిర్వాహకులు, గ్రామ పెద్దలు

ఆర్‌ఎస్‌పీ పర్యటనను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఆంజనేయులు గౌడ్

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం నిర్వహించే పాన్‌గల్ పర్యటనను జయప్రదం చేయాలని కొల్లాపూర్ నియోజకవర్గ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ డా.ఆంజనేయులుగౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో, పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయక్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

కార్మిక అనుకూల పార్టీలకే ఓటు వేద్దాం

కొత్తకోట (కొత్తకోట రూరల్): కార్మిక చట్టాలను కాలరాస్తూ పాలన చేస్తున్న పార్టీలకు స్వస్తి పలికి కార్మికుల హక్కులు, చట్టాలను కాపాడే పార్టీల వైపు కార్మికులు ఉంటారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలో హమాలీ కార్మికులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, ఆ విధానాలను అమలు చేస్తున్న బీజేపీని ఓడించాలని, కార్మికులందరూ ఇండియా కూటమికి మద్దతుగా ఉండాలని కోరారు. 10ఏళ్ల బీజేపీ పాలనలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల గురించి పట్టించుకోలేదని దుయ్యబట్టారు. కార్మిక చట్టం ప్రకారం కనీస వేతనం కింద రూ.26వేలు చెల్లిస్తే తప్ప సగటు కార్మికుడు బతుకలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో కుర్మన్న, దుప్పటి శ్రీను, లక్ష్మీపంతులు, గొల్ల కుర్మన్న, తిమ్మన్న, తోక లక్ష్మన్న, జమ్మన్న, లక్ష్మన్న, నాగన్న, గిరి, సంతోష్, బాలరాజు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న నిక్సన్

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెబ్బేరు రూరల్: కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని బుధవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ కార్మికులతో కలిసి వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులతో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావుకి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు కార్మికులతో కలిసి 138వ మే డే ఉత్సవాల వాల్ పోస్టర్లు, ప్రచార సామగ్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు పది రోజుల్లో వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీను, నరసింహ, రాజేష్, దర్గాస్వామి, కుమార్, ఆంజనేయులు, శ్రీకాంత్, ప్రశాంత్, కవిత, రాణి, మంజుల, శకుంతలమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కార్మికులు

కరీంనగర్‌లో కొత్తకోట మహిళ ఆత్మహత్య

కొత్తకోట (కొత్తకోట రూరల్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీకి చెందిన సుధారాణి(47) మహబూబ్‌నగర్ పార్లమెంట్ తెలుగుదేశం అధ్యక్షురాలిగా పనిచేశారు. ఈమె భర్త మధుసూదన్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లో ఉన్నత చదువులు చదువుతున్నారు. కూతుళ్లకు ఇబ్బంది కలుగకూడదు అనే ఉద్దేశంతో రెండేళ్లుగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి సుధారాణి తను నివాసం ఉండే ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బంధువులు బుధవారం రాత్రి మృతదేహాన్ని కొత్తకోటకు తీసుకొచ్చారు. సుధారాణి మృతికి కారణాలు తెలియరాలేదు.